

# అత్తగారి పెత్తనం

వల్లభనేని సాయిశ్రీరామ్మూర్తి

చౌదరయ్యగారు పడకకుర్చీలో పడుకొని మసక కళ్లద్దాలతో చూస్తూ పేపర్ చదువుతున్నారు. ఆయన వయస్సు ఎనభైఏళ్లు దాటుంటాయి. ఆయన భార్య దుర్గమ్మ వంటగదిలో నుంచి "టీ" తీసుకువచ్చి చౌదరయ్యగారికిచ్చి తనూ కూర్చుని తాగుతోంది. ఆమె వయసు కూడా డెబ్బైకు పైగా వుంటాయి. ఇద్దరూ వయసుమీరిన వృద్ధులు కావడంతో వారి పనులే వారికి కష్టంగా ఉన్నాయి. అయినా ఓపికతో చేసుకుంటూ కాలాన్ని గడుపుతున్నారు. వారికి ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు ప్రకాష్ - భార్య రోహిణి. వారికి ఆడ, మగ ఇద్దరు పిల్లలు. చిన్నకొడుకు సురేష్ - భార్య రేణుక. వీరికి ఇద్దరూ ఆడపిల్లలే.

సురేష్ తనకు వ్యవసాయం కలిసిరాలేదని, గత నాలుగేళ్లనాడే తల్లితండ్రులను విడిచి, మరో వూళ్లో కాపురంపెట్టి ఏదో వ్యాపారం చేసుకుంటున్నాడు. ప్రకాష్ వ్యవసాయం చేసుకుంటూ ముసలి తల్లితండ్రులను చూస్తున్నాడు. భార్య రోహిణి, దుర్గమ్మగారూ రోజూ ఏవో గొడవలు పడుతూవుంటే చివరకు 'అత్తగారి పెత్తనం' భరించలేక రోహిణి పిల్లల చదువు వంకతో భర్తను ఒప్పించి వెంకటాపురంలో కాపురంపెట్టి ఆరునెలలైంది.

"ఏవండీ, చూసారా మనవాళ్లు... వస్తాం వస్తాం అంటూ ఫోన్ చేస్తారేగాని ఇప్పటికి ఇంకా వూడిపడలేదు. ఆ పిల్లగాళ్లని చూడాలని నాకు ఎంతో ఆత్రంగా వుంది. పండుగ చూస్తే

రేపే. ఇంట్లో ఒకదానికొకటి ఏమీ కనిపించటల్లేదు. ఇక్కడ మనం ఎన్ని బాధలు పడుతున్నామో వాళ్లకేమీ అక్కర్లేదు" అంటూ దుర్గమ్మగారు చీదరించుకొంది.


"వస్తారు లేవోయ్, వాళ్లకూ ఏవో పనులుంటాయిగా" అన్నారు చౌదరయ్యగారు.

"అయినా పెద్దోడి పెళ్లాం రోహిణి రానివ్వదులే. అదేగా కొంపకు తిప్పలుపెట్టింది" అంది దుర్గమ్మ.

"దుర్గా, నీవు మాత్రం తక్కువదానివా...? కోడళ్లపై పెత్తనం చెయ్యాలని చూసావు, నీ పూర్వపు చాదస్తాన్ని ఈనాటి కోడళ్లు సహిస్తారా? నీ మూర్ఖత్వం వల్లే పెద్దకోడలు స్వార్థంగా ప్రవర్తించింది. పిల్లల చదువువంకతో ఇల్లు విడిచి, వెంకటాపురంలో కాపురం పెట్టింది. దానిమాటపైన మొగుణ్ణి నడిపించింది. ఇలా జరుగుతుందని, నీ గుణాన్ని మార్చుకోమని, నీకెన్నోసార్లు చెప్పాను. నువ్వు విన్నావా? ఇప్పుడు మనల్ని చూసేవాళ్లులేరని అఘోరిస్తున్నావు" అన్నారు చౌదరయ్యగారు.

"చాల్లెండి... మీరెప్పుడూ నన్నిలాగే సతాయిస్తున్నారు. వాళ్లను నేనేమన్నాను? బట్టలకూ, విలాసాలకూ అంతగా ఖర్చుపెట్టకండి, కాస్త పొదుపుచేసుకోండి" అన్నాను - అదే తప్పా?"

"తప్పేనోయ్! ఇప్పుడు వాళ్లు మన చేతుల్లో వుండటంలేదు. మనమే వాళ్లచేతుల్లో వుంటున్నాము. వాళ్లకు మనం సలహా యివ్వడం గాని, ఆజ్ఞాపించటంగానీ మన చేతుల్లోలేదు. ఇప్పుడు కుటుంబానికి వాళ్లే యజమానులు. కొన్ని విషయాలలో వాళ్లు చెప్పినట్లే మనం వినాలి. అప్పుడే మన పెద్దరికాన్ని గౌరవిస్తూ, మనల్ని ఆదరిస్తారు... అది తెల్సుకోవే వెంకమ్మా..."



"చాల్లెండి, నాపేరు దుర్గమ్మైతే, మాటమాట కీ వెంకమ్మా, సుబ్బమ్మా అంటూ వాళ్లముందు నన్ను లోకువ చేసింది మీరేగా. లేకపోతే కోడలు... దానికి అంత కొమ్ములొస్తాయా?"

"నీ మూర్ఖత్వంతో దానికి నీవే కొమ్ములు మొలిపించావు. అంతకంటే వేరే కారణంలేదు"

"అయినా చిన్నోడు పెళ్లాం మంచిదే. అదెప్పుడూ నా మాటకు ఎదురుచెప్పలేదు"

"పెద్దకోడలు కాస్త కట్నం తెచ్చుకొన్నది కాబట్టి, నిన్ను ఒక మూల కూర్చోమన్నది. చిన్నకోడలు ఏమీ తెచ్చుకోలేదు కాబట్టి నీ ముందు కాస్త తలవంచి నడిచింది. చాటున ఇద్దరూ ఒకటిగా నిన్ను వెక్కిరించిన తోటికోడళ్లే. చిన్నకోడలు నీ నోటిదురుసుకి ముందే బయటకు నడిచింది కనుక దాని మంచితనం నీకు కనిపించింది. పెద్దకోడలు మొన్నటి వరకూ ఇంట్లోనే వుంది కనుక తన మంచితనం ప్రక్కనపెట్టి, నీతో సమానంగా పోటీపడింది. అంతేగానీ వాళ్లిద్దరూ ఈతరం కోడళ్లేనోయ్ వెంకమ్మా"

"చాల్లే వూరుకోండి. మీరెప్పుడూ వాళ్లను వెనకేసుకురాబట్టే వాళ్లు మనల్ని ఇలా వదిలేసి వెళ్లిపోయారు. ఎప్పుడో వచ్చి ఏవో నాలుగొందలు మన మొహాన పడేస్తేనే సరిపోయిందా? మందులకూ మాకులకూ ఎన్నవుతున్నాయి? వూరికే ఇస్తున్నారా? మన రెండెకరాల పొలం వాళ్లకిందనేగా వుంది?"

"మనది మనకు సరిపోదు. కాస్త వాళ్లది కూడా ఇస్తున్నారు లేవోయ్"

"అయినా ఎవరూ ఆసరా లేకుండా ఎన్నాళ్లు బ్రతగ్గలం చెప్పండి? ఏ కాలోచెయ్యో విరిగో లేక పక్షవాతం వచ్చో మంచానపడితే ఏమిటి దిక్కు?"

"చూడు దుర్గా! మన పనులు మనం చేసు కోగలిగినంతకాలం చేసుకుందాం. ఆ తర్వాత మంచానపడితే నిద్రమాత్రలతో శాశ్వత నిద్రలోకి పోదాం... సరేనా?"

"అమ్మో... ఏమిటండీ ఆ మాటలు" అంది భయంగా దుర్గమ్మగారు. చౌదరయ్యగారు నవ్వుతున్నారు. చావంటే అంత భయమెందుకు దుర్గా? దేశరక్షణకోసం యుద్ధంలో ప్రాణాలు పోతున్న సైనికుల మాటేమిటి? అలాగే ఈ వృద్ధాప్య జీవితంలో పోరాటం కంటే చచ్చినా తప్పులేదు.

"ఆత్మహత్య మహాపాపం, పిరికితనం అంటారు కదండీ?"

"బ్రతికుండగా తప్పించుకోలేని నరకానికి, పాపానికి, ధైర్యానికి, పిరికితనానికీ ఇదొక్కటే మందోయ్".

"అయినా దేవుని ఆజ్ఞలేనిదే మృత్యువు కూడా మన చెంతకు రాదు కదండి?"

"అవునుకదా. అందుకే ధైర్యంగా బ్రతకడమే మన విధి" అన్నారు చౌదరయ్యగారు. ఇంతలో వీధి గేటు చప్పుడయింది. దుర్గమ్మగారు తలెత్తిచూసింది. మనవలు పరుగునవచ్చి "నానమ్మా, తాతయ్యా" అంటూ దుర్గమ్మగార్ని, చౌదరయ్యగార్నీ వాటేసుకున్నారు. "ఒరే ఒరే, ఓరి బడవలూ" అంటూ చౌదరయ్యగారు ఒడిలోకి తీసుకున్నారు. దుర్గమ్మగారు కూడా "నా బాబు, నా తల్లీ" అంటూ మనవల్ని ముద్దుపెట్టుకొంది.

సూట్‌కేసులు, బ్యాగ్‌లతో కొడుకులూ, కోడళ్లూ లోనికి వచ్చారు. అమ్మనీ నాన్ననీ "బాగున్నారా" అని అడిగారు కొడుకులు. "ఏం చేస్తున్నారు అత్తయ్యా, మావయ్యా" కోడళ్లు అడిగారు.

"భగవంతుడి దయవల్ల, మీ దయవల్ల, బాగున్నాములే" అన్నారు చౌదరయ్యగారు.

"ఏం బాగులే, కాళ్లనొప్పులూ, నడుం నొప్పులూ..." అంటూ దుర్గమ్మగారు నెమ్మదిగా లేచి, మంచినీళ్లు తేవడానికి ప్రయత్నిస్తూండగా "వద్దులే కూర్చోండి అత్తయ్యా" అంటూ పెద్ద కోడలు రోహిణి ఇంట్లోకి వెళ్లి మంచినీళ్లు తెచ్చి అందరికీ ఇచ్చింది. దుర్గమ్మగారి కూతురు 'అనూష' కూడా ఇవాళే వస్తానన్నది - ఇంకా రాలేదేమిటాని అంటూండగా చిన్నకొడుకు సురేష్ అన్నాడు "అనూష మాకంటే ముందు బయలుదేరానని ఫోను చేసిందమ్మా. ఇంకా రాలేదేమిటి" అంటూండగా అనూష లోనికి వచ్చింది - సూట్‌కేసు మోయలేక క్రిందపెట్టి ఒగరుస్తున్నది. వెనుక పిల్లలు వున్నారు.

"హలో వదినా, ఏమిటి... నాకంటే ముందే వూడిపడ్డారు? నాకోసం బస్‌స్టాండ్‌లో కాస్త వెయిట్‌చేయకూడదా?" అంటుండగా రోహిణి నవ్వుతూ "ఆడబిడ్డ ఇంత బరువును మోస్తూ ఎలా ఒగరుస్తుందో చూద్దామని" అంటూ ఎదురువెళ్లి సూట్‌కేస్ లోనికి తెచ్చింది. రేణుక మంచినీళ్లిచ్చింది. దుర్గమ్మ అనూష పిల్లల్ని దగ్గరకుతీసుకుని ముద్దుపెట్టుకొంది. "ఏడమ్మా? మీ ఆయన రాలేదా" అన్నాడు చౌదరిగారు.

"ఆయనకు ఖాళీలేదు" అంది అనూష కూర్చుంటూ.

"బావగారికి పండుగ పూటకూడా బిజీయేనా?" అన్నాడు సురేష్. "పండుగ వంకతో కాస్త అత్తమావల్ని చూసిపోదామని లేదా?" అన్నాడు నవ్వుతూ ప్రకాష్.

"కాదురా అన్నయ్యా, ఆఫీసుపని ఎక్కువైంది, ఆయనకు అసలు తీరికలేదు" అంది అనూష.

"అవునండీ, ఒకపూట ఆఫీసుకెళ్లకపోతే అదనపు ఆదాయం పోతుందని మా అన్నయ్య గార్ని మీ చెల్లెలుగారే ఇంటి దగ్గర పెట్టొచ్చారు" అంది నవ్వుతూ రోహిణి.

"ఇదుగో వదినోయ్... నువ్వలా అన్నావంటే రేపు నా కూతురికి, నీ కొడుక్కి ముడిపెట్టి, ఎదురుకట్నం వడికేస్తాను జాగ్రత్త" అంది అనూష.

అందరూ గొల్లున నవ్వారు - పిల్లలు "మా అమ్మమ్మా, మా తాతయ్యా, మా నానమ్మా" అంటూ ఆ వృద్ధ దంపతుల మీదకెక్కి ఎగబాకుతున్నారు - ఆ వృద్ధ దంపతులు భరించరాని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

'తాతయ్యా... మరి నీకేమో, కప్పుకోటానికి పెద్ద "రగ్గు" తెచ్చింది మా అమ్మ. చూపించనా' అంటూ తెచ్చిన సామానులు కెలుకుతున్నాడు రోహిణి కొడుకు. ఇదిగో తాతయ్యా, నువ్వు పడిపోకుండా నడవటానికి మంచి పేముకర్ర తెచ్చాము తాతయ్యా' అంటూ సురేష్ కూతుళ్లిద్దరూ వెళ్లి వాళ్ల సామానులు కెలుకుతున్నారు.

"ఒరేయ్ పిల్లలూ... మేముతీసి ఇస్తాంలే గానీ, ఆ బట్టలన్నీ కెలక్కండిరా" అంటూ రోహిణీ, రేణుకా వెళ్లి అట్టపేక్‌లో ఉన్న పేముకర్రని, మరో పేక్‌లో ఉన్న రగ్గునీ తీసి అప్యాయంగా మావగార్కి ఇచ్చారు. చౌదరయ్యగారు చిరునవ్వుతో అందుకొంటూ "ఇలాంటివి కావాలని ఇదివరకెప్పుడూ నేను అనుకోలేదు. ఇవన్నీ నాకెందుకూ?" అన్నారు.

"అదేమిటి మావయ్యగారూ, ఎప్పుడూ ఒకేలా వుంటారా... కాలాన్నిబట్టి మారాలిగా" అని కోడళ్లు అంటున్నారు. "కాలాన్ని బట్టి వేషం

మార్చనక్కరలేదు. మనుషుల మనసులను నేనెప్పుడూ అర్థం చేసుకుంటాను" అన్నారు చౌదరయ్యగారు.

"ఇవేకాదు తాతయ్యా... నీకూ నానమ్మకూ మంచి మంచి బట్టలు కూడా తెచ్చారు అమ్మా నాన్నలు" అంటూ పిల్లలు సంబరంతో గంతులు వేస్తున్నారు. అల్లరిచేస్తున్నారు.

దుర్గమ్మగార్కి పిల్లల్ని ఎత్తుకొనే ఓపికలేదు. అందరికీ ముద్దులు పెడుతోంది. పిల్లలు వృద్ధ దంపతులపై పడి చేస్తున్న అల్లరి, గంతులు చూసి, కొడుకులూ, కోడళ్లూ, కూతురూ విరగబడి నవ్వుతున్నారు. ఇలాంటి నవ్వుల, పువ్వుల వాతావరణం ఆ ఇంట కనిపించి చాలాకాలమైంది. ఈ ఆనంద వాతావరణంలో వృద్ధ దంపతుల మనసులు మరలా చాలాకాలానికి వికసించాయి. దుర్గమ్మ చౌదరయ్యగారి మొహంలోకి చూసి నెమ్మదిగా అంది "ఏమండీ, ఇంకెప్పుడూ కొడుకులూ, కోడళ్లూ, మనవలూ, మనల్ని విడిచి దూరంకారు... మనం వాళ్లను విడిచి దూరంకాలేం కదూ?"

చౌదరయ్యగారి మనసు సంతోషాలకు పొంగేదీ, కష్టాలకు కృంగేదీ కాదు. "ఇవన్నీ మామూలేనోయ్ వెంకమ్మా" అన్నాడు నెమ్మదిగా. "ఛీ... కోడళ్లు వింటారు" అంటూ దుర్గమ్మ లేచి లోనికెళ్లింది.

పిల్లల అల్లరి కాస్త ఆగింది. దొడ్డిలో జామ చెట్టు దగ్గరకు పరుగెత్తారు. ప్రకాష్ భార్యవైపు చూసి అంటున్నాడు "ఓయ్ రోహిణీ, ఇలా నవ్వులు, జోకులతో కాలయాపనేనా? రేపు పండగ పప్పులు ఏమిటో పురమాయించారా?"

"అది మీ అమ్మగారి ఆజ్ఞ. ఏమి పప్పులు వండమంటే అవే వండుతాము" అంది రోహిణి నవ్వుతూ.

"వెళ్లి అడగండోయ్" అన్నాడు ప్రకాష్ నెమ్మదిగా.

"నీకెందుకు అన్నయ్యా వాళ్లే అడుక్కుంటారు, మనకు చేసిపెడతారు. తినడమే మన పని" అంది అనూష నవ్వుతూ.

దుర్గమ్మ ఇంట్లో నుండి వచ్చింది. "ఏమే దుర్గా, ఏం పప్పులు వండాలో కోడళ్లకు చెప్పావా?" అన్నారు చౌదరయ్యగారు. "ఇంకా నేను చెప్పేదేముంది? వాళ్లకు ఏంకావాలో అవే వండుకోవచ్చు. నేనేమన్నా ఆర్చేదాన్నా, తీర్చేదాన్నా, అబ్బాయిలిష్టం, కోడళ్లిష్టం. ఒరే పెద్దోడా, ఇదిగో నాదగ్గర ఆరొందలున్నాయి. బజారుకెళ్లి నూనె, బెల్లం, పిండి, పప్పులూ తెచ్చుకుని వండుకోండి" అంటూ దుర్గమ్మగారు డబ్బు తీసిచ్చింది. తోడికోడళ్లు ఒకరి మొఖం ఒకరు చూసుకొని, అత్తగారిలో వచ్చిన మార్పుకు సంతోషించారు.

పెద్దకోడలు రోహిణి చెమ్మగిల్లిన కళ్లతో మావగారి ముందుకు వచ్చి నమస్కరించింది. "మావయ్యగారూ, మీ గొప్ప ఆలోచనలతో అత్తయ్యగారిలో మంచిమార్పు తీసుకొచ్చారు. మావగారిలా కాకుండా తండ్రిలా ఆలోచించి, ఆ రోజు నాకు మంచి సలహా ఇచ్చారు. మీ మాట ప్రకారమే మేము వెంకటాపురంలో కాపురంపెట్టి పిల్లల్ని చదివించుకొంటున్నాం" అంది రోహిణి.

విషయం అర్థంకాక దుర్గమ్మ చౌదరయ్యగారి ముఖంలోకి చూసింది. "రోహిణీ అన్న మాట ఏమిటి?" అన్నట్లు.

"అవునోయ్... పిల్లల ఎదుట పెద్దవాళ్లు కీచులాడుకుంటూంటే పిల్లలు చెడిపోతారు. అందుకే నీ పిల్లల్ని ఒక మంచి వాతావరణంలో చదివించుకోమని కొడుక్కి, కోడలికీ చెప్పాను. రోజూ మీ అత్తాకోడళ్లు పడుతున్న తగవులు

భరించలేక, ఇంటిగుట్టు వీధిపాలవుతుందని మిమ్మల్ని అలా వేరుచేసాను" అన్నారు చౌదరయ్యగారు గంభీరంగా.

దుర్గమ్మ ముఖం పాలిపోయింది. "నాకోసం మీరంతా కలిసి ఇంత నాటకమాడారా?"

అవునమ్మా... నాన్నచెప్పిన మీదటే మేము వెంకటాపురంలో కాపురం పెట్టాముకాని మిమ్మల్ని చూడకూడదన్న వుద్దేశ్యంతోకాదు" అన్నాడు ప్రకాష్.

"ఓరి మీ ఆలోచన అంతంకానూ... మీరందరూ ఒకటేనన్నమాట. సరేలే... అత్తగారు గడ్డుదన్నమాట నాకెందుకు? 'అత్తపెత్తనం' నేనేం చెయ్యను. ఇప్పుడైనా అందరూ ఇంట్లో పడివుండండి. మిమ్మల్ని నేనేమీ పట్టించుకోను. వేళకు నాకింత ముద్ద పారేయండి చాలు..."

"మరి నాకో?" అన్నాడు చౌదరయ్య. "మీకు కోడళ్లూ కొడుకులూ వున్నారు. నేనేగా పరాయి దాన్ని...?"

"లేదు అత్తయ్యగారూ... మాకు మీరు, మావయ్యగారూ ఒకటే" అంది రోహిణి.

అనూష కూతురు, రోహిణి కూతురూ జామకాయలు తింటూ అప్పటికే అక్కడికివచ్చి అంతా వింటున్నారు. "అమ్మమ్మా, నానమ్మా, మేము నీజట్టు వుంటాము. నీకేం భయంలేదు" అంటూ దుర్గమ్మగారి పక్కన నిలిచారు. దుర్గమ్మగారు మురిసిపోయి మనవల్ని కౌగిలించుకొని "నేను మంచిదాన్నికానని తాతయ్య మిమ్మల్ని నానుండి దూరం చేసాడట. తాతయ్యది దుర్బుద్ధి కదమ్మలూ?" అంది దుర్గమ్మ.

"కాదు, తాతయ్య కూడా మంచివాడే" అన్నారు పిల్లలు.

మళ్లీ అందరూ నవ్వారు. "ఇదిగో దుర్గమ్మా! మన పెళ్లైన కొత్తలో నువ్వు నాపైన దుర్బుద్ధితో రెండు సంవత్సరాలు కాపురానికి రానని పుట్టింట్లోనే కూర్చున్నావు. లేకపోతే ఇవాళ ముదిమనవల్ని కూడా ముద్దు పెట్టుకుందువుకదా?" అన్నారు చౌదరయ్యగారు.

"చాల్లే వూరుకోండి..." అంది సిగ్గుపడుతూ దుర్గమ్మ. కొడుకులూ కోడళ్లతోపాటు కూతురూ నవ్వుతోంది. "ఇదిగో వదినమ్మలూ! ఇప్పుడైనా మా అమ్మమంచిదేనని ఒప్పుకుంటారా లేదా చెప్పండి" అంది అనూష.

"ఒప్పుకున్నాం తల్లీ, లేకపోతే నీతో వేగలేము" అంది రోహిణి. "అయితే... అత్తగారి పెత్తనం మీద నడవాల్సిందే మీరంతా" అంది అనూష.

అందరూ గొల్లున నవ్వారు. పిల్లలూ వారితో శృతికలిపారు - విషయం పూర్తిగా అర్థం కాకపోయినా...

## ఆదివాసీ కథలకు ఆహ్వానం

ప్రతిభా ప్రచురణలు (ఖమ్మం) ఈ సంవత్సరం నుంచి ప్రతియేటా విస్మృత సమూహాలపై కథా సంకలనాలు ప్రచురించాలని నిర్ణయించింది. ఆదివాసీ, సంచార జాతుల జీవితం, సాంస్కృతిక మూలాలు, వాటి పరిరక్షణకోసం జరిగే సంఘర్షణ ఇతివృత్తాలుగా వచ్చే నవంబర్ నెలలో ఒక కథా సంకలనం వెలువరించనున్నారు. దీనితో ప్రచురణ నిమిత్తం ఆయా సమూహాల పట్ల సహానుభూతి, ఆర్తీ ఉన్న రచయితల నుంచి కథలను ఆహ్వానిస్తున్నారు. కథలను 'ప్రతిభా ప్రచురణలు, 4-1-19, రోటరీ నగర్, ఖమ్మం - 507002 అనే చిరునామాకి అక్టోబర్ 15వ తేదీలోపుగా అందేవిధంగా పంపించాలి. ఇతర వివరాలకు 99489 08230 (జీవన్) ని సంప్రదించవచ్చు.